క్లుప్తంగా

నాడు-నేడు పనులపై పర్యవేక్షణ పెంచండి

సి.బెళగల్: మండలంలోని పాఠశాలలో మనబడి నాడు-నేడు రెండో విడతలో భాగంగా జరుగుతున్న అభివృద్ధి పనులు, భవన నిర్మాణాలపై గ్రామ సచివాలయాల ఇంజినీర్ అసిస్టెంట్లు పర్యవేక్షణ పెంచాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గోనేనాయక్ అన్నారు. బుధవారం ఆయన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ ఇంజినీర్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ. మండలంలో రెండవ విడత నాడునేడులో భాగంగా జరుగుతున్న పనులను నెలాఖరులోగా పూర్తి చేయించాలన్నారు.

సంరక్షణ చర్యలు తీసుకోవాలి


పత్తిపంటను పరిశీలిస్తున్న ఏఓ మల్లేష్‌కుమార్

సి.బెళగల్: మండల పరిధిలో వివిధ పంటలు సాగు చేసిన రైతులు సంరక్షణకు చర్యలు తీసుకోవాలని ఏఓ మల్లేష్‌కుమార్ సూచించారు. బుధవారం ఆయన మండలంలోని పలు గ్రామాలలో పర్యటించి పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు సాగుచేసిన వేరుశనగ, మిరప, పత్తి పంటలను పరిశీలించారు. కాగా పత్తి పంటలో గులాబీరంగు పురుగును గుర్తించిన ఏఓ సస్యరక్షణ పద్ధతులను రైతులకు తెలియజేశారు. పురుగు నివారణకు రైతులు ఒక లీటరు నీటికి రెండు గ్రాముల థయోడికార్బ్ మరియు క్లోరోపైరీపాస్ ఒక లీటరు నీటికి రెండు ఎంఎల్ చొప్పున కలుపుకుని పంటపై పిచికారీ చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా బురాన్‌దొడ్డి రైతు భరోసా కేంద్రాన్ని తనిఖీ చేశారు.

ఉద్యాన రైతులకు ప్రోత్సాహం


గులాబీ తోటను పరిశీలిస్తున్న ఏపీడీ లక్ష్మన్న

కల్లూరు: జాతీయ ఉపాధి హామీ పథకం ఉద్యాన రైతులకు ప్రోత్సాహకాలు అందిస్తున్నామని ఏపీడీ లక్ష్మన్న అన్నారు. బుధవారం చిన్నటేకూరు గ్రామంలో జాతీయ ఉపాధి హామీ పథకం కింద సాగు చేసిన గులాబీ తోటను పరిశీలించారు. ఏపీడీ మాట్లాడుతూ అర్హులైన చిన్న, సన్నకారు రైతులు ఉపాధి హామీ పథకం కింద పూల తోటలు, పండ్ల తోటలు సాగు చేసుకోవచ్చున్నారు. ప్రభుత్వం మొక్కలు ఇవ్వడంతో పాటు రెండు సంవత్సరాలు వాటి నిర్వహణ ఖర్చులు ఇస్తుందని చెప్పారు. ఆసక్తి ఉన్న రైతులు గ్రామంలో ఫీల్డ్ అసిస్టెంట్లను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ మద్దేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణం పరిశీలన

కోడుమూరు రూరల్: కోడుమూరులో నిర్మిస్తున్న శ్రీఅయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణాన్ని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి పరిశీలించారు. బుధవారం కోడుమూరులో జరిగిన శక్తి కేంద్ర ప్రముఖులు, పోలింగ్ బూత్ అధ్యక్షుల సమావేశంలో పాల్గొన్న అనంతరం పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీధర్మపురి అయ్యప్పస్వామి ఆలయ నిర్మాణ పనులను పరిశీలించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆలయ నిర్మాణ విశేషాలను ఆమెకు వివరించడంతో పాటు, దుశ్శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు నీలకంఠ, శివనారాయణ, అంకాల్‌రెడ్డి, చంద్రమౌళి, పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ కోతలు

కర్నూలు(రాజ్‌విహార్): నగరంలో గురువారం విద్యుత్ కోతలు విధించనున్నట్లు విద్యుత్ సంస్థ ఏఈ జాన్ బెర్నార్డ్ తెలిపారు. ముఖ్యంగా గాంధీ నగర్, విద్యానగర్, భాస్కర్ నగర్, ఈశ్వర్ నగర్ తదితర చుట్టుప్రక్కల ప్రాంతాల్లో ఉదయం 7 నుంచి 9 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, ఇందుకు వినియోగదారులు సహకరించాలని బుధవారం ఓ ప్రకటనలో కోరారు.

ఆకట్టుకునేలా విద్యాబోధన

కర్నూలు సిటీ: విద్యార్థులకు ఆకట్టుకునేలా విద్యాబోధన సాగాలని, ఆ దిశగా ప్రధానోపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాధికారులు ఆదేశించారు. కర్నూలు డివిజన్ స్థాయిలో ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. కర్నూలు డిప్యూటీ డీఈఓ హనుమంత రావు, సమగ్ర శిక్ష అదనపు కో-ఆర్డినేటర్ డా.కె వేణుగోపాల్, అకడమిక్ మానిటరింగ్ అధికారి ప్రసాద్ పాల్గొని ప్రసంగించారు. ప్రతి నెలలో జరిగే స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. పాఠశాలలను బలోపేతం చేయాల్సిన బాధ్యత స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులపైనే ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎంఈఓలు, హెచ్‌ఎంలు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి హామీని నెరవేర్చాం

- ప్రజలకు మాపై నమ్మకం ఉంది
- నాలుగేళ్లలో గ్రామాల రూపురేఖలే మారాయి
- గడప గడపకు మన ప్రభుత్వంలో ఎంపీ పోచా, ఎమ్మెల్యే కాటసాని

పాణ్యం : ఎన్నికలకు ముందు ఇచ్చిన ప్రతి హామీని తుచా తప్పకుండా అమలు చేశామని నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం కొండజూటూరు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. దేశంలోని ఏ పార్టీ కూడా ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయలేదని, కేవలం ఏపీలో మాత్రమే తూచా తప్పకుండా అమలు చేస్తున్న ఏకైక నాయకుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరే అన్నారు. ప్రజలకు ఏ సమయంలో ఏం కావాలో ఆలోచించి మేనిఫెస్టో రూపొందించి, దానిని పవిత్ర గ్రంథంగా భావించి సంక్షేమ, అభివృద్ధి పాలన సాగిస్తున్నారని చెప్పారు. నాలుగేళ్ల పాలనలో ప్రజలకు మాపై అపార నమ్మకం కలిగిందన్నారు.

కళ్లముందే అభివృద్ధి ..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి కరోనా వల్ల ఆర్థిక సంక్షోభం ఎదురైనప్పటికీ ఎక్కడా అభివృద్ధి కుంటుపడలేదన్నారు. ప్రతి గ్రామానికి కోట్లాది రూపాయలు వెచ్చించి అభివృద్ధికి బాటలు వేశామన్నారు. కళ్లముందే గ్రామ సచివాలయం మొదలుకొని మనబడి నాడు-నేడు, ఆర్‌బీకే, డిజిటల్ లైబ్రరీలు, హెల్త్ సెంటర్లు, మంచినీటి ట్యాంకులు, అంతర్గత రోడ్లు, డ్రైనేజీలు ఇంకా ప్రజలకు ఉపయోగపడే పలు రకాల అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ఇది కేవలం నాలుగు సంవత్సరాల వైఎస్సార్‌సీపీ పాలనలోనే సాధించామన్నారు.

ఘన స్వాగతం

గడప గడపకు -మన ప్రభుత్వం కార్యక్రమానికి విచ్చేసిన ఎంపీ, ఎమ్మెల్యేకు గ్రామ ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. భారీ గజమాల వేసి సత్కరించారు. గ్రామంలో అభివృద్ధి పనులపై భారీగా బ్యానర్లు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సద్దల సరళమ్మ, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సద్దల సూర్యనారాయణరెడ్డి, ఎంపీపీ ఉసేన్‌బీ, వైస్ ఎంపీపీ వెంకటేశ్వర్లు, పార్వతమ్మ, సర్పంచ్ సద్దల సుజిత్‌రెడ్డి, ఎంపీటీసీ గణేష్, తహసీల్దార్ శ్రీనివాసులు గౌడ్, ఎంపీడీఓ దస్తగిరి, మండల సచివాలయ కన్వీనర్ సుమంత్‌రెడ్డి, కందిప్రసాద్, ఏసురత్నం, ప్రతాప్‌రెడ్డి, ప్రదీప్‌రెడ్డి, లక్ష్మీమద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

నిరంతర విద్యుత్ అందించడమే లక్ష్యం

ఓర్వకల్లు : ప్రజలకు, రైతులకు నిరంతరం విద్యుత్‌ను సరఫరా చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని


లబ్ధిదారులకు సంక్షేమ క్యాలెండర్ అందజేస్తున్న ఎంపీ పోచా, ఎమ్మెల్యే కాటసాని

ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని సోమయాజులపల్లె వద్ద ఉన్న 220 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ విస్తరణ పనులకు ఎమ్మెల్యే భూమిపూజ చేసి, పనులను ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. 220 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ పనులను విస్తరించడంతో ప్రజలకు, రైతు సోదరులకు విద్యుత్ సమస్య తీరుతుందన్నారు. కొన్నేళ్లుగా పొరుగు మండలం నుంచి విద్యుత్ సరఫరా కావడంతో ఉయ్యాలవాడ, మీదివేముల, ఉప్పలపాడు గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సివచ్చేదన్నారు. ఈ సమస్యను పరిష్కరించడానికి ఇటీవల ఉయ్యాలవాడ గ్రామ సమీపంలో రూ.1.80 కోట్లతో నూతన విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సోమయాజులపల్లె సర్పంచు విజయమ్మ, స్థానిక నాయకులు మదన్ వెంకటరెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


విద్యుత్ సబ్‌స్టేషన్ విస్తరణ పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే కాటసాని

నేడు సి.బెళగల్‌లో 'గడప గడపకు మన ప్రభుత్వం'

సి.బెళగల్: స్థానిక గ్రామ సచివాలయం- 1 పరిధిలోని గురువారం ఉదయం 8 గంటల నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఈఓఆర్డీ సందీప్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ ముఖ్య అతిథిగా హాజరై గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకోవడంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఆయా కుటుంబాలకు అందిన సేవలు, సంక్షేమ పథకాలను వివరిస్తారన్నారు. మండల స్థాయి అధికారులు, గ్రామ సచివాలయాల ఉద్యోగులు, వలంటీర్లు తప్పనిసరిగా అందుబాటులో ఉండాలని ఈఓఆర్డీ ఆదేశించారు. అలాగే గురువారం 11 గంటలకు సి.బెళగల్ గ్రామ సచివాలయం-1లో 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు మళ్లీ సీఎం కావాలి' కార్యక్రమం ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు జేసీఎస్ మండల కన్వీనర్ సీబీ తులసిరెడ్డి తెలిపారు.

ప్రభుత్వ భూములను పరిరక్షించాలి

గూడూరు రూరల్: అన్యాక్రాంతమవుతున్న ప్రభుత్వ భూములను పరిరక్షించాలని సీపీఎం డివిజన్ నాయకుడు మోహన్ డిమాండ్ చేశారు. చనుగొండ్లలో ఆక్రమణకు గురైన భూమిని బుధవారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ చనుగొండ్లలోని సర్వే నంబర్ 131-1లో ఉన్న 1.21 ఎకరాల ప్రభుత్వ భూమిని కొందరు వ్యక్తులు ఆక్రమించుకుని రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసేందుకు యత్నిస్తున్నారన్నారు. ఆ భూమిని రెవెన్యూ అధికారులు స్వాధీన పరచుకోవాలన్నారు.

వేగంగా డ్రైనేజీ నిర్మాణం


బస్తిపాడు ఎస్సీ కాలనీలో డ్రైనేజీ నిర్మాణాన్ని పరిశీలిస్తున్న కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ కేవీ రమణారెడ్డి

కల్లూరు: ఏళ్ల తరబడి మౌలిక వసతులకు నోచుకోని ప్రాంతంలో డ్రైనేజీ కాలువల నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు తీసుకుందని కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ కేవీ రమణారెడ్డి స్పష్టం చేశారు. బుధవారం ఎస్సీ కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న సీసీ డ్రైనేజీ కాలువ పనులను ఆయన పరిశీలించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రజలు గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువలు నిర్మించాలని ఎమ్మెల్యేను కోరారు. స్పందించిన ఎమ్మెల్యే గ్రామ సచివాలయానికి మంజూరైన రూ. 20 లక్షల నిధులతో డ్రైనేజీ కాలువలు, సీసీ రోడ్ల నిర్మాణాలు చేపట్టేలా చర్యలు తీసుకున్నారు. ఈ పనులు శరవేగంగా సాగుతున్నాయి. బుధవారం పనులను పరిశీలించిన రమణారెడ్డి రోడ్లు, డ్రైనేజీ కాలువల నిర్మాణంలో నాణ్యత ప్రమాణలు పాటించాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు.

నేడు సంక్షేమ పథకాల బోర్డుల ఆవిష్కరణ

కర్నూలు సిటీ: ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారు. పేదల సంక్షేమమే లక్ష్యంగా ఎన్నో పథకాలు ప్రవేశపెట్టారు. ఆయా పథకాల ద్వారా వివిధ వర్గాల ప్రజలకు చేకూరిన లబ్ధిని తెలియజేసేందుకు కోడుమూరు నియోజకవర్గ పరిధిలోని ప్రతి సచివాలయంలో నేడు సంక్షేమ పథకాల బోర్డులు ఏర్పాటు చేయనున్నారు. దీంతో పాటు వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని కూడా ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే డా.జరదొడ్డి సుధాకర్, ఆయా మండలాల్లోని ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లతో పాటు, సచివాలయ కన్వీనర్లు, పార్టీ మండల కన్వీనర్లు, వలంటీరులు, గృహసారథులు, కన్వీనర్లు పాల్గొననున్నారు. నియోజకవర్గంలో నేడు సంక్షేమ పథకాల బోర్డుల ఆవిష్కరణకు సంబంధించిన షెడ్యూల్‌ను ఆ పార్టీ నాయకులు ప్రకటించారు. సి.బెళగల్ సచివాలయం-1లో ఉదయం 11 గంటలకు, గూడూరు సచివాలయం -1లో మధ్యాహ్నం 1 గంటకు, కోడుమూరు సచివాలయం-1లో మధ్యాహ్నం 3 గంటలకు, కర్నూలు మండలంలోని బి.తాండ్రపాడు గ్రామంలోని సచివాలయం-1లో సాయంత్రం 4.30 గంటలకు ఆవిష్కరణ కార్యక్రమం జరగనుందని తెలిపారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డాక్టర్ వి.వి.సుబ్రహ్మణ్యకుమార్

కల్లూరు: విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని సిల్వర్ జూబ్లీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.వి. సుబ్రహ్మణ్యకుమార్ పేర్కొన్నారు. బుధవారం దూపాడు సమీపంలోని అశోకా మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. కార్యక్రమానికి సిల్వర్ జూబ్లీ కళాశాల ప్రిన్సిపాల్ వి.వి.సుబ్రహ్మణ్య కుమార్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకొని నిరంతరం సాధన చేస్తే అనుకున్న లక్ష్యం చేరుకోవచ్చన్నారు. వివిధ కోర్సులపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. డైరెక్టర్ హరీష్ కృష్ణ, అధ్యాపకులు శేషాద్రి కిరణ్, సుజాత, విద్యార్థినిలు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాల తనిఖీ


వివరాలు అడిగి తెలుసుకుంటున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి. రామగిడ్డయ్య

కర్నూలు(హాస్పిటల్): జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ బి. రామగిడ్డయ్య బుధవారం పెద్దటేకూరు, లక్ష్మీపురం, కల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ముజఫర్‌నగర్ యూపీహెచ్‌సీలలో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలను తనిఖీ చేశారు. శిబిరాల్లో వచ్చిన రోగులకు అందరికీ వైద్యసేవలు అందుతున్నాయా, వైద్యపరీక్షలు చేస్తున్నారా, వారికి మందులు అందజేస్తున్నారా అందరికీ ఫోల్డర్ బ్యాగ్స్ ఇస్తున్నారా, వైద్యులు బాగా చూస్తున్నారా అని ఆరా తీశారు. వచ్చిన వారికి పరిసరాల పరిశుభ్రత ప్రాముఖ్యత గురించి వివరించారు. పంచాయితీ వారితో కలిసి వాటర్ ట్యాంకులను శుభ్రపరిచి క్లోరినేషన్ చేయించాలని వైద్య సిబ్బందికి సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఆశాలు, ఏఎన్ఎంలు రోగులు, ప్రజల ఇళ్లకు వెళ్లి క్రానిక్ పేషంట్‌లను వైద్యశిబిరాలకు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఆటోడ్రైవర్ మృతి

కర్నూలు : స్థానిక ఎస్‌ఏపీ క్యాంప్‌నకు ఎదురుగా ఉన్న తిలక్ నగర్‌లో నివాసముంటున్న జి.మద్దిలేటి (39) రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. ఈయన ఆటో తోలుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. బుధవారం ఉదయం బాడుగ నిమిత్తం షరీన్ నగర్‌కు వెళ్లి తిరిగి వస్తూ రిజిస్ట్రార్ కార్యాలయానికి ఎదురుగా షరీన్ నగర్ వైపు ఉన్న సర్వీస్ రోడ్‌లో ఆటో నిలుపుదల చేసి రిజిస్ట్రార్ ఆఫీసు వైపు నడుచుకుంటూ వెళ్తుండగా డోన్ వైపు నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న కారు వేగంగా వచ్చి ఢీకొట్టింది. కడప జిల్లాకు చెందిన విష్ణువర్ధన్‌రెడ్డి వాహనాన్ని నడుపుతుండగా ప్రమాదం జరిగింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మద్దిలేటిని చికిత్స నిమిత్తం విష్ణువర్ధన్‌రెడ్డి ఆసుపత్రికి తరలించాడు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తలకు, ఉదర భాగంలో బలమైన గాయాలై తీవ్ర రక్తస్రావం కావడం వల్లే చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు. విష్ణువర్ధన్‌రెడ్డి నిర్లక్ష్యం వల్లే తన భర్త రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడని భార్య నాగేశ్వరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఈయనకు ఒక కూతురు సంతానం.

వ్యర్థాల సేకరణకు వేలం


వ్యర్థాల సేకరణకు బహిరంగ వేలం నిర్వహిస్తున్న మున్సిపల్ అధికారులు

కర్నూలు (టౌన్) : నగరపాలక సంస్థ పరిధిలో వ్యర్థాల సేకరణకు బుధవారం బహిరంగ వేలం నిర్వహించారు. నగరపాలక సంస్థ కౌన్సిల్ హాలులో నిర్వహించిన ఈ వేలంలో పాటదారులు మధ్య పోటీ నడిచింది. కర్నూలు పరిధిలో చికెన్, మటన్, చేపల వ్యర్థాలు సేకరించేందుకు పలువురు పోటీ పడ్డారు. నగరపాలక అధికారులు పాట రూ. 1.35 లక్షలు నిర్ణయించగా రూ.6.5 లక్షలు పాట పాడి కుమార్ అనే వ్యక్తి దక్కించుకున్నాడు. అలాగే పాణ్యం, కోడుమూరు పరిధిలో వ్యర్థాల సేకరణకు రూ. 95 వేలు నిర్ణయించారు. కుమార్ అనే పాటదారుడు రూ. 1.60 లక్షలకు దక్కించుకున్నాడు. వేలంలో పాల్గొన్న 8 మంది పాటదారులు పోటీ పడటంతో నగర పాలక రెవెన్యూ విభాగానికి గణనీయంగా ఆదాయం సమకూరింది. వేలాలను నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ పర్యవేక్షణ చేశారు. నగరపాలక అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్, మున్సిపల్ ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి పాల్గొన్నారు.

'గడప గడపకు మన ప్రభుత్వం'తో గ్రామాల అభివృద్ధి

- ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్
- సి.బెళగల్ సచివాలయం 1 - పరిధిలో పర్యటన


ప్రజా సమస్యలు తెసుకుంటున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

సి.బెళగల్: గ్రామాలలో నిర్వహిస్తున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంతో గ్రామాల సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ అన్నారు. బుధవారం ఆయన మండల కేంద్రం సి.బెళగల్‌లోని గ్రామ సచివాలయం 1 - పరిధిలో అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామానికి చేరుకున్న ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి నాలుగున్నరేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను, ఆయా ఇళ్లకు చేకూరిన లబ్ధిని వివరించారు. అలాగే ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామస్తులు తెలిపిన సమస్యలను అధికారులతో నమోదు చేయించి వాటిని వీలైంత త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. అదేవిధంగా గ్రామ, మండల స్థాయిలో పరిష్కారం కాని సమస్యల వివరాల నివేదికలను తనకు అందజేయాలని, వాటిని ఉన్నతాధికారులతో మాట్లాడి పరిష్కరించే బాధ్యత తానే తీసుకుంటానని గ్రామ ప్రజలకు హామీ ఇచ్చారు.

99 శాతం నేరవేర్చిన సీఎం జగనన్నే

దేశంలోని ఏ రాష్ట్రంలో అమలుకాని సంక్షేమ పథకాలను మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేశారని ఎమ్మెల్యే అన్నారు. ఎన్నికల ముందు ప్రకటించిన హామీలను 99 శాతం నేరవేర్చిన ఘనత మన సీఎంకు మాత్రమే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గిరిజోను, ఎంపీటీసీ సభ్యుడు వీరన్న గౌడ్, జేసీఎస్ మండల కన్వీనర్ సీబీ తులసిరెడ్డి, మార్కెట్‌యార్డు డైరెక్టర్ ఎస్‌ఎం బాషా, వైఎస్సార్‌సీపీ నాయకులు బసయ్య, రఘురెడ్డి, నాగరత్నం, గొర్లమద్దిలేటి తదితరులు ఉన్నారు.

నీటి వనరుల సర్వేను పూర్తి చేయండి

సి.బెళగల్: మండల పరిధిలోని గ్రామాలలో ఉన్న నీటి వనరుల వివరాల సర్వేను వెంటనే పూర్తి చేయాలని తహసీల్దార్ శేషఫణి అన్నారు. బుధవారం ఆయన ఏఎస్‌ఓ ఆదినారాయణతో కలిసి వీఆర్వోలు, సర్వే సహాయకులతో సమావేశం నిర్వహించారు. సర్వే నిర్వహణపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ.. పల్లెల్లో నీటి వనరులుగా ఉన్న చెరువులు, కుంటలు, వంకలు, చెక్‌డ్యామ్‌ల వివరాలను వాటర్‌బాడీ సర్వే యాప్‌లో నమోదు చేయాలన్నారు. ఈనెల 11వ తేదిలోగా వాటర్‌బాడీ సర్వే పూర్తిచేయని వారిపై చర్యలుంటాయని హెచ్చరించారు.

బంద్ విజయవంతం

ఓర్వకల్లు: మండలంలో బుధవారం వామపక్ష విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో జరిగిన విద్యా సంస్థల బంద్ విజయవంతంగా ముగిసింది. కడపలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయడంతో పాటు విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరణ చేయాలనే ఆలోచనను సంహరించుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు శరత్‌కుమార్, ఆర్‌వీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవీంద్రనాథ్, పీఎస్ యూ జిల్లా అధ్యక్షులు అయ్యన్న, సీఐటీయూ నాయకులు నాగన్న ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలను మూయించి, రాస్తారోకో చేపట్టారు.

పాణ్యం : విశాఖ ఉక్కు ప్రయివేటీకరణ ఆపాలని, కడప స్టీల్ ప్లాంట్ నిర్మాణం చేపట్టాలని కోరుతూ చేపట్టిన బంద్ విజయవంతమైనట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి ప్రతాప్, ఏఐఎఫ్‌బీ నాయకులు వెంకటాద్రి తెలిపారు. కార్యక్రమంలో రాజా, సతీష్, మధు, జానీ, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

కల్లూరు : మండల వ్యాప్తంగా విద్యా సంస్థల బంద్ విజయవంతం అయ్యిందని పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు రమణ తెలిపారు. భవిష్యత్తు తరాలకు ఉద్యోగాలు కావాలంటే ప్రభుత్వ రంగ సంస్థలు ప్రభుత్వ ఆధినంలో ఉండాలన్నారు. కార్యక్రమంలో వీరేష్, అస్లాం, పురుషోత్తం, ఉరుకుంద, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

వేలం పాటలు వాయిదా

ఓర్వకల్లు: మండలంలోని కాల్వబుగ్గ దేవస్థానంలో గురువారం జరగాల్సిన బహిరంగ వేలం పాట తాత్కాలికంగా వాయిదా పడినట్లు ఆలయ ఈఓ డీఆర్‌కేవీ ప్రసాద్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆలయ ప్రాంగణంలో ఏడాది కాలం పాటు పలు రకాల వ్యాపారాలు నిర్వహించుకునేందుకు ఈ నెల 9న వేలం పాట నిర్వహించాల్సి ఉందన్నారు. అయితే అనివార్య కారణాల మూలంగా వేలం పాటలు నిలిపివేసినట్లు ఆయన పేర్కొన్నారు.

అమర వీరుల ఆశయాలు సాధిద్దాం

నందికొట్కూరు: సమ సమాజం స్థాపన కోసం పోరాడుతూ అమరులైన చంద్రపుల్లారెడ్డి, పైలా వాసుదేవరావు, తరిమెల నాగిరెడ్డిల ఆశయాల సాధన కోసం పోరాడదామని సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసి డివిజన్ కార్యదర్శి అరుణ్‌కుమార్ పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో వారి చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళ్లులర్పించారు. సంతాప సభను నిర్వహించారు. ఉమ్మడి జిల్లా కార్యదర్శి నరసింహులు మాట్లాడుతూ దేశంలో అధికారంలో ఉన్న బీజేపీ పాలకులు ప్రభుత్వరంగాన్ని ప్రైవేటీకరించి నిరుద్యోగాన్ని పెంచుతున్నారని విమర్శించారు. ఆ పార్టీ జిల్లా నాయకులు గోపాల్, ప్రేమరాజు, గోవిందు, తిమ్మన్న, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

వృథాగా ఎస్సార్బీసీ నీరు

- బ్లాక్-5కు ఇష్టానుసారంగా నీరు వదులుతున్న అధికారులు
- రోడ్డెక్కి పారుతున్నవైనం
- ఇళ్లలోకి నీరు చేరి ప్రజల అవస్థలు
- పట్టించుకోని అధికారులు


ఓ వీధిలోకి చేరిన నీరు


నీరు ఇళ్లలోకి రాకుండా అడ్డుకట్ట వేసుకున్న దృశ్యం

పాణ్యం : వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతుల అవసరాల నిమిత్తం ఎస్సార్బీసీకి వారబందీ పద్ధతిలో నీటిని విడుదల చేస్తున్నారు. ఈ నీరు వృథా చేయకూడదని ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు మొత్తుకుంటున్నారు. అయితే కొందరు అధికారుల తీరుతో నీరు భారీగా వృథా అవుతోంది. గోనవరం గ్రామం వద్ద కాల్వలో నీరు స్థాయిని మించి ప్రవహిస్తోంది. ఎస్సార్బీసీ ప్రధాన కాల్వ నుంచి బ్లాక్-5 క్లావ కింద గోనవరం, అనుపూరు, అహల్యాపురం, అలమూరు, కొత్తూరు గ్రామాలకు సాగు నీరుఅందుతుంది. అయితే కొద్ది రోజుల నుంచి కాల్వకు ఇష్టమొచ్చినట్లు నీరు వదులుతుండంతో కాల్వ ఎక్కి రోడ్డుపై ప్రవహించడమే కాక ఏకంగా ఇళ్లలోకి వెళ్తున్నాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాక గ్రామంలోని కాల్వ వెంట ఉన్న వీధులన్నీ నీట మునుగుతున్నాయి. అధికారులకు చేప్పినా పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. దీనికి తోడు కొందరు కాల్వ దిగువన అడ్డుకట్ట వేసి నీరు వెళ్లకుండా చేస్తున్నారు. దీనికపై అధికారుల పర్యవేక్షణ కొరవడింది. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకొని కాల్వకు సామర్థ్యం మేరకు నీటి విడుదల చేసి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

మహిళా సమాఖ్య సెక్రటరీగా అనురాధ


బిడుదూరి అనురాధ

గడివేముల: నంద్యాల జిల్లా మహిళా సమాఖ్య సెక్రటరీగా గడివేముల ఐక్య సంఘం అధ్యక్షురాలు బిడుదూరి అనురాధ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆమెను స్థానిక పొదుపు కార్యాలయంలో ఏపీఎం హజరత్ ఆధ్వర్యంలో మహిళలు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అనురాధ మాట్లాడుతూ .. పొదుపు సంఘాలు మరింత బలోపేతం చేసేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. పొదుపు మహిళల కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టిందన్నారు. గత టీడీపీ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నేరవేర్చకపోవడంతో పాటు మహిళలను అప్పుల ఊబిలోకి నెట్టిందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత పొదుపు మహిళలకు ఇచ్చిన హామీని నేరవేర్చి వారి అభ్యున్నతికి ఎన్నో పథకాలు అమలుచేశారని వివరించారు. ఎన్నికలు సమీపిస్తున్నాయని మాజీ సీఎం చంద్రబాబునాయుడు మోసపూరిత మాటలను నమ్మవద్దని మహిళలకు సూచించారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న సీఎం వైఎస్ జగన్‌ను రానున్న ఎన్నికల్లోనూ ఆశీర్వదించాలని కోరారు. తన ఎన్నికకు సహకరించిన పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

14న మండల సర్వసభ్య సమావేశం

కల్లూరు: ఈ నెల 14న ఎంపీపీ బోయ శారద అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో మండల సర్వసభ్య సమావేశం ఉంటుందని ఎంపీడీఓ జీవీ రమణమూర్తి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీటీసీ సభ్యులు, సింగిల్ విండో చైర్మన్లు, సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు హాజరుకావాలని కోరారు.

సున్నపు పౌడర్ లారీ సీజ్

కర్నూలు (న్యూటౌన్): ప్యాపిలి నుంచి సున్నపు పౌడర్‌ను అక్రమంగా రవాణా చేస్తున్న లారీని సీజ్ చేసినట్లు మైన్స్ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ తెలిపారు. బుధవారం సాయంత్రం తనిఖీలు చేపట్టగా అక్రమంగా రవాణా చేస్తున్న సున్నపు లారీ, రాయల్టీ చెల్లించకుండా నాపరాయిని తరలిస్తున్న రెండు టిప్పర్లను సీజ్ చేసి రూ.55 వేలు జరిమానా విధించినట్లు ఆయన వెల్లడించారు. తనిఖీల్లో విజిలెన్స్ ఏడీ బైరాగి నాయుడు, రాయల్టీ ఇన్‌స్పెక్టర్ మురహరి పాల్గొన్నారు.